పదవీ విరమణ శుభాకాంక్షలు
రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వివిధ హోదాల్లో 38 సంవత్సరాల పాటు ప్రజలకు అంకితభావంతో నిబద్ధతతో సమర్థతతో సేవలందించి తేది : 30-06-2025 నాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తహసీల్దార్ గా పదవీ విరమణ పొందుతున్న మా ప్రియమైన శ్రీ పి. శంకర్ మామ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని కోరుకుంటూ..
శ్రీ పి.శంకర్ గారు
Administrative officer (తహసీల్దార్)
మహబూబ్‌నగర్
మేనల్లుళ్లు మరియు మేనకోడళ్లు
గమనిక : తేది: 01-07-2025 మంగళవారం రోజు సా. 4 : 00 గంటలకు కలెక్టరేట్ నందు సన్మాన కార్యక్రమము జరుపబడును

విద్యాశాఖలో.. వసూళ్లు

ఆంధ్రజ్యోతి నిఘా



ఫైల్ కదలాలంటే కాసులు ఇవ్వాల్సిందే..

- ప్రైవేట్ పాఠశాలల అనుమతుల విషయంలో భారీగా ముడుపులు
- ఇవ్వని వారి ఫైల్స్ పక్కకు
- ఆరోపణలు వచ్చిన సిబ్బంది మార్పు
- అయినా తీరుమారని మరో ఐదుగురు
- వారిపై చర్యలకు రంగం సిద్ధం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖలో వసూళ్ల పర్వం ఆగడం లేదు. శాఖలో ఉన్నతాధికారులు మారినా అక్కడ పనిచేసే సిబ్బంది తీరు మారకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత డీఈవో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కినా.. కార్యాలయంలో ఫైలు కదలాలంటే ఇంకా చేయి తడపాల్సిన పరిస్థితి మారకపోవడం సిబ్బంది పని తీరుకు అద్దం పడుతోంది. కొత్తగా ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, రెన్యూవల్, పై తరగతుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న పాఠశాల యాజమాన్యాల ఫైళ్లు కదలాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది మధ్య గొడవలు, పంపకాల్లో పంచాయతీలు రావడంతో ఈ విషయాలు వెలుగు చూస్తున్నాయి. వీటిని పలు మార్లు విద్యాశాఖ అధికారి దృష్టికి తేగా, ఆయన సిబ్బంది, సెక్షన్స్ సిబ్బందిని హెచ్చరించినా మారడం లేదని సమాచారం. దాంతో వారిపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.



మహబూబ్‌నగర్ డీఈవో కార్యాలయం

డబ్బులు ఇచ్చిన వారికి అనుమతులు

ఏటా కొత్తగా ప్రైవేట్ పాఠశాలల అనుమతుల కోసం అక్టోబరు 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత డిసెంబరు వరకు ప్రతీ నెల రూ.10 వేల అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ చెబుతోంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కొత్తగా పాఠశాలల ఏర్పాటుకు, పై తరగతులు పెంచుకునేందుకు జిల్లాలో 42 దరఖాస్తులు వచ్చాయి. అందులో చాలా పాఠశాలల దరఖాస్తులు సరిగా లేవంటూ సెక్షన్ సిబ్బంది ఫైల్ పక్కన పెట్టినట్లు తెలిసింది. అయితే అడిగిన మేర డబ్బులు ఇచ్చిన వారి దరఖాస్తులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. ఆ ఫైల్స్ మండల విద్యాశాఖ నుంచి డీఈవో వద్దకు రాగానే అనుమతులు కూడా వచ్చాయని, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన ఫైల్ ఆర్‌జేడీ వద్దకు వెళ్లగా, అక్కడి నుంచి కూడా అనుతులు ఇచ్చారని తెలుస్తోంది. ఈ విషయంలో ఇద్దరు.. ముగ్గురు డీఈవో కార్యాలయ సిబ్బంది కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. దీంతో ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై డీఈవో చర్యలు తీసుకున్నారు. ఒకరిని సమగ్రశిక్షా అభియాన్ కార్యాలయంలోకి, ఇద్దరిని బీఈడీ కళాశాలలోకి పంపించారు.

డీఈవో చెబితే వినాలా?

డీఈవో చెబితే వినాలా? ఆయన కంటే కార్యాలయంలో తాము చాలా సీనియర్ అని మాట్లాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 16 నుంచి 20 ఏళ్లుగా కార్యాలయంలో పని చేస్తున్నాం.. ఎలా పని చేయాలో మాకు తెలియదా? అన్న రీతిలో ఇద్దరు ముగ్గురు మాట్లాడినట్లు తెలుస్తోంది. దీంతో కార్యాలయంలో పలువురి సెక్షన్స్ మార్పు చేశారు. వారంలో మరో నలుగురు నుంచి ఐదు మంది సిబ్బంది సెక్షన్ మార్చి, బీఎడ్, డైట్ కళాశాలలకు బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



సిబ్బందిపై ఆరోపణలు వచ్చాయి

కార్యాలయంలో పని చేసే సీనియర్ అసిస్టెంట్స్, ఇతర సిబ్బందిపై పలు ఆరోపణలు వచ్చాయి. దాంతో ముగ్గురిని ఇప్పటికే ఇతర సెక్షన్స్‌కు మార్చాము. మరో ఐదు మందిపై కూడా ఆరోపణలు ఉన్నాయి. వారు తీరు మార్చుకోకపోతే చర్యలు ఉంటాయి. కార్యాలయంలోని ఇతర సెక్షన్స్‌కు లేదా బీఎడ్, డైట్ కళాశాలలకు బదిలీ చేస్తాం.
- ఎ.ప్రవీణ్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి

మరో ఐదుగురిపై చర్యలకు రంగం సిద్ధం

విద్యాశాఖలో మరో ఐదు మందిపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. వివిధ సెక్షన్‌లలో పలువురు కొన్నేళ్లుగా పని చేస్తున్నారు. కార్యాలయంలో ఏ పని కావాలన్నా చేయి తడపాల్సిందే అన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉపాధ్యాయులు తమ పనుల కోసం, అదేవిధంగా స్కూల్స్ అనుమతులు, టీసీ పుస్తకాలు, ఇతర పనులపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు కార్యాలయానికి వస్తుంటారు. వారికి సంబంధించిన పనులు కావలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని, లేదంటే అక్కడి ఫైళ్లు మాయం అవుతాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయాలు డీఈవో రాగా, ఆయన హెచ్చరించినా వారిలో మార్పు రాలేదు. దాంతో మరో ఐదుమంది సిబ్బందిపై బదిలీ వేటు వేసే అవకాశం ఉంది.

నాలుగు నెలల్లో.. లోపాలు సరిచేయాలి



మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల

- ప్రభుత్వ వైద్య కళాశాలకు ఎన్‌ఎంసీ ఆదేశాలు
- 175 సీట్లతో 10వ బ్యాచు విద్యార్థులకు ప్రవేశాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగు నెలల్లో లోపాలు సరి చేసుకోవాలని జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) ఆదేశాలు జారీ చేసింది. షరతులతో కూడిన అనుమతులు ఇస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో 175 సీట్లతో 10వ బ్యాచు విద్యార్థులకు కళాశాలలో ప్రవేశాలు లభించనున్నాయి.

సరి చేసుకుంటామన్న ప్రభుత్వం

ఎంబీబీఎస్ 10వ బ్యాచు సీట్ల కోసం కళాశాల యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. దీంతో ఎన్ఎంసీ బృందం కళాశాల, ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టింది. 5 లోపాలు గుర్తిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాలలకు నోటీసులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం స్పందించి లోపాలను సరిచేస్తామని ఎన్ఎంసీకి హామీ ఇచ్చింది. ఆ హామీలకు సంతృప్తి చెందిన ఎన్ఎంసీ నాలుగు నెలల్లో లోపాలను సరిచేసుకోవాలని సూచించింది. దీంతో కళాశాలలో ప్రవేశాలకు కొంత ఉపశమనం కలిగించింది.

షరతులతో కూడిన అనుమతులు..

కళాశాలలో గుర్తించిన లోపాలను సరి చేసుకునేందుకు ఎన్ఎంసీ అవకాశం ఇచ్చింది. దీంతో పాటు కొన్ని షరతులు కూడా విధిస్తూ ఎంబీబీఎస్ ప్రవేశాలు చేసుకోవాలని సూచించింది. దీని ప్రకారం కళాశాలలో 175 సీట్లకు అనుమతి లభించింది.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మంజూరైన మొట్టమొదటి వైద్యకళాశాల ఇదే. ప్రస్తుతం కొత్తగా మంజూరైన కళాశాలతో పోలిస్తే ఈ కళాశాలలో చాలా వరకు పోస్టులు మంజూరు చేయలేదు. ఇప్పటికి కూడా సూపర్ స్పెషాలిటీ పోస్టులే లేవు. మొత్తం 254 పోస్టులకు 124 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 128 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ ఉస్మానియా, గాంధి మెడికల్ కళాశాల, ఆసుపత్రులకు దీటుగా పనిచేస్తోంది. 1500 నుంచి 1800 మంది వరకు ఓపీ ఉంటోంది. కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నారు. తక్కువ మంది ఉన్నప్పటికీ, పనిభారం ఎక్కువైనా కళాశాలకు మంచి పేరు తెస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాశాలకు అవసరమైన పోస్టులు, నిధులు మంజూరు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

టైగర్ సఫారీకి మూడు నెలల విరామం



సఫారీ వాహనాలు

- నల్లమల సందర్శనకు ఎవరూ రావొద్దు : డీఎఫ్‌వో
- నేటి నుంచి సెప్టెంబరు 30 వరకు వన్యప్రాణుల సంతానోత్పత్తి సమయం అయినందునే..

మన్ననూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే రెండో అతిపెద్దదైన అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో విజయవంతంగా పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్న టైగర్ జంగల్ సఫారీకి వైల్డ్‌లైఫ్ 3 మాసాలు విరామం ప్రకటించింది. ప్రతీ ఏటా జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు పెద్ద పులులతో పాటుగా ఇతర వన్యప్రాణులకు సంతానోత్పత్తి జరిపే సమయంగా వైల్డ్‌లైఫ్ నిర్ధారించింది. ఇకో టూరిజం ద్వారా మన్ననూరు నుంచి ఫర్హాబాద్ వ్యూపాయింట్ వరకు, దోమలపెంట నుంచి అక్కమహాదేవి గుహల వరకు పర్యాటకులకు అనుమతించే జంగల్ బుక్ టైగర్ సఫారీ ని నిలిపి వేస్తున్నట్లు అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. అటవీ నిబంధనలు

(మిగతా 6లో..)

పని చేయని అధికారులపై.. చర్యలు

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హెచ్చరిక
- మునిసిపల్ అధికారులతో సమీక్ష

నారాయణపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పనిచేయని అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హెచ్చరించారు. సోమవారం నారాయణపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునిసిపల్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కాంగ్రెస్ ముఖ్య నాయకులను సైతం ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా మునిసిపల్ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు సరిగా పనిచేయడం లేదని, పనితీరులో మార్పు రాకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వందరోజుల ప్రణాళిక సరిగ్గా నిర్వహించడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. దోమల నివారణకు వార్డుల్లో ఫాగింగ్ చేయాలని, వీధి దీపాలు అమర్చి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ త్వరితగతిన చేయాలని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి వారిలో ఉన్న అపోహలు తొలగించాలని వార్డు ఆఫీసర్లకు సూచించారు. అధికారులు అధికార పార్టీ నాయకులను కలుపుకుపోవాలని, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు సమాచారమిచ్చి గ్రౌండింగ్‌తో పాటు ఇళ్ల మార్క్‌వుట్ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన సమస్యలు నెలరోజుల్లో పరిష్కరించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శంకర్, మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, ఇంజనీర్ మహేష్, అధికారులు శ్రీనివాస్, లక్ష్మీనర్సింహ, చెన్నకేశవులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.సలీం, గందె చంద్రకాంత్, హరినారాయణ భట్టడ్, మనోహర్‌గౌడ్, సంతోష్, సుధాకర్, మహేష్, అమీరొద్దీన్, సాయిబాబు, మల్లేశ్, మైనొద్దీన్ తదితరులున్నారు.



మునిసిపల్ అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

చిన్నారులకు చిరునవ్వుల వరం

- వెట్టి నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యం
- తనిఖీల కోసం ప్రత్యేక అధికారుల బృందాలు
- నేటి నుంచి 'ఆపరేషన్ ముస్కాన్' ప్రారంభం
- ఏటా జూలైలో 'ఆపరేషన్ ముస్కాన్', జనవరిలో 'ఆపరేషన్ స్మైల్'

7

హలో అమ్మా.. బాగున్నావా!

- గురుకుల పాఠశాలల్లో 'ఫోన్ మిత్ర'
- విద్యార్థుల సంఖ్యను బట్టి ఫోన్ల ఏర్పాటు
- పిల్లలకు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం
- రోజూ 25 నిమిషాల సమయం
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్

6

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర

- ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రత్యేక పూజలు

7

జిల్లా ప్రజలకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు
మారుతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
MARUTHI MULTI SPECIALITY HOSPITAL
24/7 Emergency Services
రక్త పరీక్షలు 20% తగ్గింపు ఉచితం
14 రోజుల ఉచిత క్యాంపు
క్రిటికల్ కేర్
జనరల్ ఫిజీషియన్ & డయాబెటాలజీ
జనరల్ & లాప్రోస్కోపిక్ సర్జన్
న్యూరాలజీ
ఆర్థోపెడిక్ & స్పైన్ సర్జరీ
గైనకాలజీ
నెఫ్రాలజీ & యూరాలజీ
రేడియాలజీ
1-4-3/2, శెట్టి కాంప్లెక్స్ దగ్గర, న్యూటౌన్, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ - 509 001
ఫోన్ : 90526 99929, 90526 99939

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- ప్రజావాణికి 142 ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. 142 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేసి, పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. చేపట్టిన చర్యలను వివరిస్తూ దరఖాస్తుదారులకు సమాచారం తెలుపాలన్నారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని చెప్పారు.

ప్రభుత్వ కార్యక్రమాలను పర్యవేక్షించాలి

మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాలల్లో ప్రతీవారం ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి చెప్పారు. అందులో భాగంగా గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలు, అంగన్‌వాడీలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలును ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర మండల అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నర్సింహులు, జడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ శుభాకాంక్షలు
రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో వివిధ హోదాల్లో 38 సంవత్సరాల పాటు ప్రజలకు అంకితభావంతో నిబద్ధతతో సమర్థతతో సేవలందించి, నేడు 30-06-2025 నాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తహసీల్దార్ గా పదవీ విరమణ పొందుతున్న మా మిత్రుడు శ్రీ పి. శంకర్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.
మీ విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని కోరుకుంటూ..
శ్రీ పి.శంకర్ గారు
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (తహసీల్దార్)
మహబూబ్‌నగర్
Steno Consumer Court, M.Nagar
TRSMA Dist. President

ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

» సోమశిల వద్ద కృష్ణానదిలో పెరుగుతున్న నీటి మట్టం



సోమశిల కృష్ణానది వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసు అధికారులు

కొల్లాపూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి వరద పెరుగుతండటంతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని పర్యాటక కేంద్రం సోమశిల వద్ద సోమవారం పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ ఎస్‌ఐ హృషికేష్ మాట్లాడారు. కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో వరద ఉధృతి పెరుగుతోందన్నారు. వరద నీటిలో ఎవరూ దిగొద్దని, విషసర్పాలు, మొసళ్లు ఉన్నాయని తెలిపారు. నదిలో స్నానం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అప్రమత్తంగా ఉండాలని ప్రజలు, పర్యాటకులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, మాజీ సర్పంచ్ మద్దిలేటి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదిక సభ రసాభాస

» అవినీతి జరిగిందంటూ నాయకుల అభ్యంతరం



మండల కేంద్రంలోని సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

మిడ్జిల్, జూన్ 30: (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్‌లో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ ప్రజావేదిక సమావేశం రసాభాసగా ముగిసింది. ఉపాధి హామీ 15వ విడత సామాజిక తనిఖీపై మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందాల సభ్యులు ఇటీవల గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చిన అవినితి, అక్రమాలకు సంబంధించిన విషయాలను గ్రామాల వారీగా వారు ప్రజావేదిక దృష్టికి తీసుకొచ్చారు. మస్టర్ ఎంట్రీతో పాటు కొలతలు సక్రమంగా లేవని, కొందరు కూలీలకు సక్రమంగా వేతనాలు ఇవ్వలేదని వారు తెలిపారు. మండలంలోని చిలువేరు, వెలుగొమ్ముల, సింగందొడ్డి, మిడ్జిల్, భైరంపల్లి, వల్లభరావుపల్లి, చౌటకుంటతండా, లింబ్యాతండా, దోనూర్, కొత్తూర్ గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన వివరాలను చదివి వినిపించారు. మండల కేంద్రంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినితి జరిగినట్లు గ్రామానికి చెందిన నాయకులు ఆరోపించారు.

చేసిన పనుల కంటే ఎక్కువ డబ్బులు డ్రా చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. రోడ్డు, ఫీడర్ చానల్‌కు సంబంధించిన పనుల కొలతలు సక్రమంగా లేవని ఆందోళనకు దిగారు. అదే సమయంలో గ్రామానికి చెందిన టెక్నికల్ అసిస్టెంట్ హర్షిత కళ్లు తిరిగి పడిపోయింది. తోటి సిబ్బంది పరిచర్యలు చేయడంతో కోలుకున్నది.

అనంతరం సమావేశాన్ని కొనసాగించారు. మిగిలిన గ్రామాలకు సంబంధించిన పనులపై మంగళవారం విచారణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలను వెల్లడించనున్నట్లు చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో ముసాయిదాబేగం, అంబుడ్స్ పర్సన్ సంతోష్, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రేమలత, ఎంపీడీవో గీతాంజలి, ఏపీవో రాజేశ్‌కుమార్‌లతో పాటు సామాజిక తనిఖీ బృందాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

రేవల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా, రేవల్లి మండలంలోని తలుపునూరుకు చెందిన ఉప్పరి రేణుక (23) అనే వివాహిత అదృశ్యమైన ట్లు ఎస్‌ఐ రజిత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పరి దస్తగిరి, రేణుక దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. శనివారం సాయంత్రం అయిదు గంటలకు రేణుక ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త గమనించాడు.

ఇంత సేపు ఎవరితో మాట్లాడుతున్నావంటూ ఆమె ను మందలించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మరుసటి రోజు ఆదివారం ఉదయం తెల్లవారుజామున అయిదు గంటలకు దస్తగిరి నిద్రలే చి చూడగా, ఇంట్లో రేణుక కనిపించలేదు. చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో, బం ధువుల ఇళ్లల్లో ఆరా వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హలో అమ్మా.. బాగున్నావా!

» గురుకుల పాఠశాలల్లో 'ఫోన్ మిత్ర'
» విద్యార్థుల సంఖ్యను బట్టి ఫోన్ల ఏర్పాటు
» పిల్లలకు తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం
» సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్



బుద్దారం గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడుతున్న విద్యార్థినులు

వనపర్తి విద్యావిభాగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులకు దూరంగా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఇంటిపై బెంగతో ఇబ్బంది పడుతుంటారు. తల్లిదండ్రులతో ప్రతీ రోజు మాట్లాడాలని అనుకుంటుంటారు. కానీ ఫోన్ సౌకర్యం అందుబాటులో లేదని బాధ పడుతుంటారు. వారి ఆవేదనను గుర్తించిన ప్రభుత్వం 'ఫోన్ మిత్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యార్థుల సంఖ్యను బట్టి టెలిఫోన్‌లను ఏర్పాటు చేసింది.

ప్రతీ రోజు 25 నిమిషాలు

స్మార్ట్‌కార్డుల ద్వారానే విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసే అవకాశం ఉంటుంది. ప్రతీ రోజు 25 నిమిషాలు మాట్లాడుకోవచ్చు. ఒక్కో కార్డును ఐదుగురు విద్యార్థులు వినియోగించుకోవచ్చు. ఒక విద్యార్థి ఐదు నిమిషాలు మాట్లాడవచ్చు. అందుకోసం కార్డుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను నమోదు చేస్తారు. దీంతో పాటూ ఒక టోల్ ఫ్రీ నెంబర్ (గురుకుల అధికారి) కూడా ఉంటుంది. విద్యార్థులకు ఏ సమస్యలు ఎదురైనా ఈ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చు.

మానసిక ఒత్తిడి తగ్గుతుంది

విద్యార్థులు ఇంటికి దూరంగా ఉండాల్సి రావడంతో మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. గురుకులాల్లో ఏర్పాటు చేసిన ఫోన్లలో ప్రతీ రోజు తల్లిదండ్రులతో మాట్లాడటంతో ఒత్తిడి తగ్గి చదువుపై ధ్యాస పెరుగుతుంది. అయిదుగురికి ఒక స్మార్ట్ కార్డు చొప్పున అందించాం. విద్యార్థులు తమకు కేటాయించిన సమయంలో ప్రతీ రోజు ఐదు నిమిషాల పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవచ్చు. - ప్రమోద, డిస్ట్రిక్ కో ఆర్డినేటర్

ఆరు గురుకులాల్లో ఫోన్ మిత్ర సేవలు

వనపర్తి జిల్లాలో మదనాపురం, పీపనగండ్ల బాలుర గురుకులాలతో పాటూ, గోపాల్‌పేట, పెద్దమందడి, కొత్తకోట, వనపర్తి బాలికల గురుకుల పాఠశాలల్లో 3,840 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారందరికీ 'ఫోన్ మిత్ర' సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో విద్యార్థులు ప్రతీ రోజు తల్లిదండ్రులతో మాట్లాడుకునే అవకాశం ఉంటుంది. ప్రతీ రోజు క్షేమ సమాచారాలు తెలుసుకోవచ్చని అటు కుటుంబ సభ్యులు, ఇటు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీవీ కన్వెన్షల్ హాల్‌లో నేడు ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, జిల్లా ప్రచార కార్యదర్శి భానుప్రకాశ్‌రెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారని తెలిపారు.

'సరకుల పంపిణీలో టెండర్లు అమలు చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్స్‌కు నిత్యావసర సరుకుల పంపిణీలో టెండర్ల విధానం అమలు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దన్నోజు అరవింద్‌చారి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఖాజా నజీమ్ అలీ అప్సర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టల్స్‌కు కిరాణం సరుకుల మాదిరిగా కూరగాయలు, చికెన్, గుడ్లు, పాలు వంటి సరుకుల పంపిణీలో టెండర్ విధానం లేకపోవడంతో నాణ్యత లోపించిందన్నారు. దీంతోపాటు అవకతవకలు కూడా జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం టెండర్ విధానం అమలు చేసి మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆయన కోరారు.

టైగర్ సఫారీకి మూడు నెలల విరామం

(5వ పేజీ తరువాయి)

ఉల్లంఘించి ఎవరైనా నల్లమలలో సంచరిస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారు.

పెద్దపులి సిగ్గరి...

నల్లమల అభయారణ్య ప్రాంతంలో జూలై నుంచి సెప్టెంబర్ మాసం వరకు పెద్దపులులు జతకట్టే కాలం. అడవిలో వర్షాలు కురిసి చెట్లు విస్తారంగా పెరగడంతో ప్రశాంతమైన వాతావరణంలో పెద్దపులులు, ఇతర వన్యప్రాణులు జతకట్టి సంతానోత్పత్తి జరుపుతాయి. అడవిలో ఎలాంటి మానవ అలజడి తగిలినా వాటి ఏకాంతతకు భంగం వాటిల్లుతుంది. పెద్దపులులు సంతానోత్పత్తితో పిల్లలతో కూడి ఉన్న సందర్భంలో మానవుల అలజడి వినిపించినా, తారసపడినా దాడులు సైతం చేసే ఆస్కారం ఉంటుంది.

పెద్దపులుల పెంపునకు అటవీశాఖ చర్యలు

అమ్రాబాద్ పులుల అభయారణ్యంలో అధికార యంత్రాంగం చేపట్టిన సంరక్షణ చర్యలు, అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడకుండా చేయడం, సీసీ ట్రాప్ కెమెరాల పర్యవేక్షణలో పెద్దపులులు ఇతర వన్యప్రాణుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటారు. వాటికి కావాల్సిన ఆహార వనరులను ఏర్పాటు చేస్తూ ఉండటంతో ప్రతి ఏటా అమ్రాబాద్ అభయారణ్యంలో పెద్దపులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 2024 గణాంకాల ప్రకారం పెద్దపులులు 34, చిరుత పులులు 170కి పైగా, ఇతర వన్యప్రాణుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. రాబోయే రోజుల్లో వటవర్లపల్లి, కుడిచింతలబైలు, సార్లపల్లి గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించి పునరావాస ప్యాకేజీని అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ గ్రామాలన్నీ తరలిపోతే పెద్దపులులకు ఇక్కడ ఆవాసం ఉండేందుకు సురక్షిత ప్రాంతంగా అటవీ అధికారులు తయారు చేయనున్నారు.



అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం



నల్లమలలో సంచరిస్తున్న పెద్దపులి (ఫైల్)

పర్యాటకులు సహకరించాలి



ప్రతి ఏటా మాదిరే జూలై1 నుంచి సెప్టెంబరు 30 వరకు టైగర్ సఫారీ టూర్‌కు వచ్చే పర్యాటకులు నిషేధాన్ని అమలు చేసేందుకు అటవీశాఖకు సహకరించాలి. ఎన్‌టీసీఏ మార్గదర్శకాల ప్రకారం పెద్దపులులు, వన్యప్రాణుల సంరక్షణలో ఇది ఒక ముఖ్యమైన చర్య. మళ్లీ అక్టోబర్ 1 నుంచి టైగర్ సఫారీని పునః ప్రారంభిస్తాం.

- డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

మరింత విస్తృతంగా రెడ్‌క్రాస్ సేవలు

» జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



రెడ్‌క్రాస్ సొసైటి సభ్యుడు సంగాల అయ్యపురెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్

గద్వాల న్యూటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సర్వసభ్యసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022 నుంచి 2025 వరకు సొసైటీ ఆధ్వర్యంలో చేసిన సేవ కార్యక్రమాలు అత్యంత అభినందనీయమన్నారు. సొసైటీ కాలపరిమితి పూర్తయినందున ఎన్నికల ప్రక్రియను చేపట్టాలని సూచించారు. అందుకోసం ప్రత్యేక ఎన్నికల అధికారిని నియమించినట్లు చెప్పారు. ఈనెల 18న ఎన్నికలను ఓటింగ్ ప్రక్రియ ద్వారా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలందించిన సభ్యులను అభినందించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రమేశ్, రాష్ట్ర ఈసీ మెంబర్ డాక్టర్ మోహన్‌రావు, వైస్ చైర్మన్ తాహిర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పాలమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.వెంకటేష్, జిల్లా కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్మికులతో కలిసి కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రీన్ ఛానల్ నుంచి వేతనాలు ఇస్తామని చెప్పి ఆరు నెలల నుంచి వేతనాలు ఇవ్వటం లేదన్నారు. కార్మికుల పరిస్థితులు దినదినగండంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు పుట్టక ఒక్కపూట భోజనానికి గగనమైపోయిందన్నారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవటం, 15 ఫైనాన్స్ నుంచి అయినా వచ్చే డబ్బులు రావటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం కలుగ చేసుకుని కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు, కురుమన్న, వెంకటేష్, బృందమ్మ, బాలయ్య, కిష్టన్న, నాగన్న, హనుమంతు, బాలమ్మ పాల్గొన్నారు.

పుంజుకున్న జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు/అమరచింత, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి వేగం పుంజుకున్నదని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగువ జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లను ప్రారంభించి సోమవారం 2.828 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు చెప్పారు. ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 73.521 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. దిగువ జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా సోమవారం నాటికి 3.907 బిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు తెలిపారు. రెండు జల విద్యుత్ కేంద్రాల్లో మొత్తం 160 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే తొందరలోనే నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి, రికార్డు నెలకొల్పే అవకాశం ఉందని తెలిపారు. అలాగే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ, సమాంతర కాలువల హెడ్ రెగ్యులేటర్ల వద్దకు వరద నీరు భారీగా వచ్చి చేరింది. ఖరీఫ్ పంటకు ఎడమ కాలువ నుంచి 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నగదు బదిలీ చేయాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి మత్స్యకార్మికుల లేఖ



సీఎంకు లేఖ పంపుతున్న నాయకులు

పీపనగండ్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : చేపలకు బదులుగా నగదు బదిలీ చేయాలని వనపర్తి జిల్లా, పీపనగండ్ల మండలంలోని గోవర్దనగిరి మత్స్య కార్మిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చేప పిల్లలను సరఫరా చేయడం లేదన్నారు. దీంతో చేప పిల్లలు ఎదగక పోవడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేప పిల్లలకు బదులుగా మత్సకారుల ఖాతాల్లో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార్మిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్, గ్రామ అధ్యక్షుడు సురేంద్రబాబు, కార్యదర్శి గుంటి మశేశ్, కోశాధికారి పడిగన్న, నాయకులు ఎం.అంజనేయులు, యాటకిరి నాగన్న, సభ్యులు పాల్గొన్నారు.

పత్తి రైతు పరేషాన్

సీడ్ పత్తి విత్తన ఉత్పత్తిపై సీలింగ్...!

» ఎకరాకు 200 ప్యాకెట్లే తీసుకుంటామని మెలిక
» లేదంటే పంటలను తొలగించుకోవాలని సూచన
» గత ఏడాది భారీగా సీడ్ పత్తి దిగుబడులు
» దీంతో కంపెనీల వద్ద పెరిగిపోయిన సీడ్ నిల్వలు

గద్వాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గద్వాల సీడ్ పత్తి విత్తనోత్పత్తిలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఏళ్ల తరబడి సీడ్‌పత్తి విత్తనోత్పత్తిలో ఉన్న రైతులు మారుతున్న పరిణామాలు చూసి విస్తుపోతున్నారు. సీడ్ విత్తన ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విత్తనం విత్తి నెల రోజులు గడుస్తున్న సమయంలో ఇలాంటి ఆంక్షలు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గద్వాల జిల్లాలో సీడ్ పత్తి విత్తనోత్పత్తి సాగు దాదాపు 57వేల ఎకరాలలో చేశారు. ఇందులో దాదాపు 30వేల నుంచి 40వేల మంది రైతులు దీనినే నమ్ముకున్నారు. వేల మంది కూలీలకు ఉపాధిని ఇస్తుంది. వ్యవసాయ రంగంలో ఇంతటి ప్రాధాన్యం ఉన్న సీడ్‌పత్తి సాగుపై మూడేళ్ల నుంచి జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే నడిగడ్డలో సీడ్ పత్తి విత్తన ఉత్పత్తి తగ్గిపోయే పరిస్థితికి వచ్చింది.

సీలింగ్ పెట్టడంపై రైతుల ఆగ్రహం

సీడ్‌పత్తి విత్తన ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాలకు 150 నుంచి 200 ప్యాకెట్లు మాత్రమే తీసుకుంటామని కంపెనీలు చెబుతున్నాయని ఆర్గనైజర్లు చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఈ విషయం ముందస్తుగా విత్తనం విత్తే సమయంలో చెబితే సీడ్ పంట వేయాలా..? వద్దా అని నిర్ణయం తీసుకునే వాళ్లం. విత్తనం విత్తి దాదాపు నెల రోజులు గడుస్తుందని రైతులు అంటున్నారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఈ సమయంలో ఉత్పత్తిపై సీలింగ్ పెట్టడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర పంటల విత్తనం విత్తేకాలం పోయిన తర్వాత చావుకబురు చెబుతున్నట్లు ఇప్పుడు చెబితే ఏ పంటలు వేసుకోవాలని, భూ యజమానులకు కౌలును ఎలా చెల్లించాలని ప్రశ్నిస్తున్నారు. ఎకరాకు ఎంత సీడ్ ఉత్పత్తి అవుతుందో అంత మొత్తం సీడ్‌ను తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సీడ్‌ను తీసుకోకపోతే నిలదీస్తాం

నడిగడ్డలో సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ రంజిత్ కుమార్ ఆరోపిస్తున్నారు. సీడ్ విత్తనం సాగై నెల రోజులు గడిచిపోయిన తర్వాత కొన్ని కంపెనీలు సీడ్‌పై ఆంక్షలు పెడుతున్నారని మొక్కలను తొలగిస్తే ఎకరాకు రూ.7500 నుంచి రూ.10వేల వరకు పరిహారం ఇస్తామని చెబుతున్నాయని అంటున్నారు. సీడ్ ఎక్కువ అయినపుడు సాగుకోసం రైతులకు సీడ్‌ను ఇచ్చే ముందు ఎంత ఉత్పత్తి కావాలో అన్ని ఎకరాలకు మాత్రమే సీడ్ ఇచ్చి సాగు చేయించుకోవాలని, ఇప్పుడు ఆంక్షలు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు. సీడ్‌ను కంపెనీలు తీసుకోకపోతే మళ్లీ పోరాటం చేయాల్సి వస్తుందని, అవసరమైతే కోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరిస్తున్నారు.



గట్టు మండలం బోయలగూడెం గ్రామంలో పత్తి పంటను తొలగిస్తున్న రైతు

నేను సీడ్‌ను తీసుకోను



నేను మూడు ఎకరాలలో సాగు చేశాను. కౌలు, పెట్టుబడితో కలిపి రూ.3 లక్షలు ఖర్చు అయ్యింది. ఇప్పుడు ఆర్గనైజర్ ఫోన్ చేసి పంటను తొలగించు.. ఎకరాకు రూ.7వేలు ఇస్తాను అంటున్నాడు. నేను ఎందుకు తొలగించాలి? నాకు రూ.3లక్షలు ఖర్చు అయ్యింది. ఎకరాకు రూ.లక్ష ఇస్తే తొలగిస్తాను అన్నాను. దీంతో ఆర్గనైజర్ నీ ఇష్టం ఆ పంటతో నాకు సంబంధం లేదు అని ఫోన్ పెట్టేశాడు.

- గొర్ల తిమ్మప్ప, రైతు, ఉలిగేపల్లి, మల్దకల్ మండలం

అవకాశ వాదం ప్రదర్శించిన కంపెనీలు

కంపెనీలు రైతులతో చెలగాటం ఆడుతున్నాయి. సీడ్ నిల్వలు పెరిగిపోయి, సీడ్ విక్రయాలు తగ్గిపోయాయని గుర్తించి ఆంక్షలు పెట్టినట్లు తెలుస్తున్నది. గత ఏడాది సీడ్ పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. ఎకరాకు 300 ప్యాకెట్లు పండాల్సి ఉండగా, దాదాపు 350నుంచి 450 ప్యాకెట్ల వరకు పండింది. దీంతో కంపెనీల దగ్గర ఉత్పత్తి నిల్వలు పెరిగిపోయాయి. మార్కెట్‌లో విత్తన సీడ్ విక్రయాలు పెరుగుతాయని కంపెనీలు భావించాయి కానీ ఈ ఏడాది గణనీయంగా విక్రయాలు పడిపోయాయని కంపెనీలు చెబుతున్నాయి. ఉత్తర భారత దేశంలో అనుమతులు లేని కంపెనీల సీడ్ విక్రయాలు గట్టి పోటీ ఇవ్వడంతో మార్కెట్‌లో విక్రయాలు కాక నిల్వలు మిగిలిపోయాయని కంపెనీలు అంటున్నాయి. అందుకే ఉత్పత్తిని తగ్గించాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. అయితే కంపెనీలు రైతులకు సీడ్ ఇచ్చే ముందే తగ్గించుకోవాల్సి ఉండగా గత ఏడాది మాదిరిగానే వేల ఎకరాలకు సీడ్ ఇచ్చి ఇప్పుడు నిల్వలు పెరిగిపోయాయని పలువురు చెబుతున్నారు. సీడ్‌ను తగ్గించుకోవడానికి ఉత్పత్తిపై సీలింగ్ ఆంక్షలు పెట్టడం సరైన పద్ధతి కాదని రైతులు, రైతు సంఘాలు అంటున్నాయి.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

» ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని ఆత్మహత్యాయత్నం

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి దక్కలేదని ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన బందుల ఈశ్వర్ (28), తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జ్యోతి ప్రేమించుకొని, ఈ నెల 14న హైదరాబాద్‌లో పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు హైదరాబాద్‌కు వెళ్లి వారిని కలిశారు. పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి తీసుకొచ్చి మల్కాపూర్ స్టేజీ వద్ద ఈశ్వర్‌ను వదిలి, జ్యోతిని తీసుకుని వారి గ్రామానికి వెళ్లిపోయారు. వారు పెళ్లి విషయం మాట్లాడకపోవడంతో మనస్తాపానికి గురైన ఈశ్వర్ ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు అతడిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఈ నెల 22న హైదాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సంఘటనపై మృతుడి చంద్రయ్య ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి...



చరణ్ (ఫైల్)

అయిజ (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని మేడికొండ గ్రామానికి చెందిన చరణ్(26) ఆదివారం మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. అదే సమయంలో రమేశ్ అనే వ్యక్తి తుపతురాల నుంచి ద్విచక్రవాహనంపై అయిజకు వస్తున్నాడు. రాత్రి 10:30 గంటల సమయంలో మంత్రాలయం రహదారిపై రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చరణ్ కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. అతడి భార్య కాన్పు నిమిత్తం పుట్టింటికి వెళ్లినట్లు తెలిసింది. మృతుడి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మతి స్థిమితం లేని వృద్ధుడు...

మూసాపేట (ఆంధ్రజ్యోతి) : మతిస్థిమితం తప్పిన ఓ వృద్ధుడు పొరపాటున కలుపు మందు తాగి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, అడ్డాకుల ఎస్ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. గుడిబండ గ్రామానికి చెందిన గౌని సురేందర్‌రెడ్డి (64)కి కొంతకాలంగా మతిస్థిమితం తప్పింది. ఈ నెల 29న నీళ్లు అనుకొని ఇంట్లో ఉన్న కలుపు నివారణ మందు తాగి అపస్మారకస్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మహబూబ్‌నగర్ జిల్లా అనుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు నరేందర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

» ముగ్గురికి గాయాలు

ఊట్కూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని అమీన్‌పూర్ వద్ద సోమవారం సాయత్రం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వడ్ల శివకుమార్, కమ్మరి అంజనేయులు నారాయణపేటలో కార్పెంటర్ పని చేస్తున్నారు. సోమవారం పని ముగించుకొని ద్విచక్రవాహనంపై గ్రామానికి బయలుదేరారు. అదే సమయంలో మగ్దూంపూర్ గ్రామానికి చెందిన కిషోర్ నారాయణపేట మండలం బైరంకొండ గ్రామంలో ఉన్న తన భార్యను తీసుకొచ్చేందుకు ఓబ్లపూర్ మీదుగా నారాయణపేటకు వెళ్తున్నాడు. పగిడిమారి గ్రామం దాటిన తర్వాత అమీన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో ముగ్గురూ గాయపడ్డారు. వడ్ల శివకుమార్, కమ్మరి అంజనేయులులకు కాళ్లు విరగాయి. స్థానికులు గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని నారాయణపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. కమ్మరి అంజనేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

శివకుమార్‌తో పాటు కిషోర్ నారాయణపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై ఊట్కూర్ ఎస్ఐ రమేశ్‌ను సంప్రదించగా ప్రమాదం జరిగినట్లు ఫోన్ రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసిన తర్వాత కేసు నామోదు చేస్తామని చెప్పారు.

దాయాదుల మధ్య గొడవ

» వ్యక్తిపై దాడి, కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని ఉప్పరిపల్లిలో దాయాదుల మధ్య ఘర్షణ జరిగింది. ఏఎస్ఐ సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కల్వకోల్ సుధాకర్‌రెడ్డి ఈ నెల 29న సాయంత్రం పొలం వద్ద ఉండగా అతడి దాయాది గోవర్ధన్ రెడ్డి వచ్చాడు. భాగ పరిష్కారంలో తనకు రావాల్సిన పొలం కొంత మా భూమిలో ఉందంటూ గొడవకు దిగాడు. దుర్భాషలాడుతో కర్రతో దాడి చేయగా సుధాకర్‌రెడ్డి కుడి చేతికి గాయమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గోవర్ధన్ రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పొరపాటున మరొకరి బ్యాగు తీసుకొచ్చిన ప్రయాణికురాలు

» స్వాధీనం చేసుకొని తిరిగి అప్పగించిన ఆర్టీసీ అధికారులు



జడ్చర్ల కొత్తబస్టాండులో ప్రయాణికురాలి నుంచి బ్యాగును స్వాధీనం చేసుకుంటున్న ఆర్టీసీ అధికారులు

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పొరపాటున మరొకరి బ్యాగు తీసుకొచ్చిన ప్రయాణికురాలు నుంచి బ్యాగును స్వాధీనం చేసుకుని తిరిగి సంబంధింత ప్రయాణికురాలుకు పంపించిన సంఘటన సోమవారం జడ్చర్ల కొత్త బస్టాండులో చోటుచేసుకుంది. జడ్చర్ల న్యూ బస్టాండు మేనేజర్ యాదగిరి కథనం ప్రకారం.. వీపనగండ్ల మండలం తూంకుంట గ్రామపంచాయతీ పరిధి సంపత్‌రావుపల్లికి చెందిన శంకరమ్మ కొమరవెల్లి మల్లన్నను దర్శించుకొని హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో బయలుదేరింది. హైదరాబాద్‌లో బస్సుదిగే సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మరో మహిళ బ్యాగును తీసుకొని వల్లభాపురం (కొల్లాపూర్) బస్సు ఎక్కింది. కాగా హైదరాబాద్‌లో తన బ్యాగు పోయిందంటూ ఆర్టీసీ అధికా రులకు సదరు మహిళ ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. శంకరమ్మ చేతిలో ఆ బ్యాగును గుర్తించి, జడ్చర్ల కొత్తబస్టాండు అధికారులకు సమాచారం అందజేశారు. దీంతో జడ్చర్ల కొత్త బస్టాండులో బస్సులో ఉన్న శంక రమ్మ వద్ద ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకుని, తిరిగి హైదరాబాద్ ఆర్టీసీ అధికారులకు పం పించారు. బ్యాగును స్వాధీనం చేసుకునే సంద ర్భంలో ట్రాఫిక్ గైడ్స్ వెంకటయ్య, శివరాముడు, సెక్యూరిటీ లింగంపేట నర్సిములు ఉన్నారు.

చిన్నారులకు చిరునవ్వుల వరం

» వెట్టి నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యం
» తనిఖీల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు
» నేటి నుంచి 'ఆపరేషన్ ముస్కాన్' ప్రారంభం

నారాయణపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వెట్టి చాకిరీలో బాల్యం బందీ అవుతోంది. తల్లిదండ్రుల పేదరికం, చదువుపై వారికి సరైన అవగాహన లేకపోవడం.. కారణమేదైనా కావచ్చు కానీ పుస్తకాలు పట్టుకొని బడికెళ్లాల్సిన చిన్నారులు హోటళ్లు, ఇటుకల బట్టీలు, పరిశ్రమలు, మెకానిక్, కిరాణం దుకాణాల్లో బాలకార్మికులుగా మారుతున్నారు. వారికి విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతీ సంవత్సరం జూలైలో 'ఆపరేషన్ ముస్కాన్, జనవరిలో 'ఆపరేషన్ స్మైల్' పేరిట రెండు సార్లు ప్ర త్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈనెల 1 నుంచి 11వ 'అపరేషన్ మస్కాన్'కు శ్రీకా రం చుట్టింది. నెలాఖరు వరకు ఈ కార్యక్రమం కొన సాగనున్నది.



పేట కలెక్టరేట్‌లో అపరేషన్ ముస్కాన్‌పై అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఆరేళ్లలో గుర్తించిన బాల కార్మికులు

సం.	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్	మొత్తం	నమోదైన కేసులు
2019	53	106	159	-
2020	75	-	75	-
2021	125	61	186	-
2022	57	166	223	-
2023	170	105	275	05
2024	57	27	84	32
2025	66	-	-	02
మొత్తం	613	465	1,078	39



జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

ప్రభుత్వం అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వారు జిల్లా వ్యాప్తంగా పర్యటించి అకస్మిక దాడులు నిర్వహించనున్నది. ఇప్పటికే నారాయణపేట జిల్లా కలెక్టరెట్‌లో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో డీఎస్పీ లింగయ్య పోలీసు, బాలల సంరక్షణ, కార్మిక, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆపరేషన్ ముస్కాన్‌పై దిశా నిర్దేశం చేశారు. మంగళవారం నుంచి ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించనున్నాయి. కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేష్ గౌతమ్ పర్యవేక్షణలో వివిధ శాఖల సమన్వయంతో బడి బయట కార్మికులను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అలాగే చిన్నారులను యాచక వృత్తికి పంపిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



బాలకార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు ప్రజలందరూ సహకరించాలి. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలు నిర్వహించి ఆరేళ్లలో 1,078 మంది బాల కార్మికులకు విముక్తి కల్పించాం. ఎక్కడైనా బాల కార్మికులను పనుల్లో పెట్టుకున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 100 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. అధికారులు దాడులు నిర్వహించి వారికి విముక్తి కల్పిస్తారు. యజమానులపై కేసులు నమోదు చేస్తారు.

- యోగేష్ గౌతమ్, ఎస్పీ, నారాయణపేట

నేడు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

» మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో నిర్వహణ

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలికల జట్టును మంగళవారం ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు మంచిర్యాల జిల్లా, రామకృష్ణపూర్‌లో ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికలకు వనపర్తి జిల్లా మినహా పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులు పాల్గొనొచ్చని తెలిపారు.

2009, జనవరి 1 నుంచి 2011, డిసెంబర్ 31 మధ్య పుట్టిన వారు ఎంపికలకు ఎంపికలకు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా స్టేడియానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలని సూచించారు.

నేడు 'జూరాల' పరిశీలనకు జాన్‌వెస్లీ

గద్వాల టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు పరిశీలనకు మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రానున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆయన ప్రాజెక్టు వద్దకు చేరుకుంటారని పేర్కొన్నారు. క్రస్ట్ గేట్లను పరిశీలించి, మరమ్మతులు, పూడిక తొలగింపు తదితర అంశాలను తెలుసుకుంటారని తెలిపారు.

ప్రాజెక్టు స్థితిగతులు, వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని తెలిపారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. పర్యటనలో జాన్‌వెస్లీతో పాటు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీరామ్ నాయక్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో జగన్నాథ స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి



రథాన్ని లాగుతున్న భక్తులు

నారాయణపేట న్యూటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం జగన్నాథ రథయాత్రను కనుల పండువగా నిర్వహించారు. ఆదిత్య నర్సింహదాసు ఆధ్వర్యంలో సరాఫ్ బజార్ బాలాజీ మందిరం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు.

భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కే రాజ్‌కు మార్‌రెడ్డి రథయాత్ర జరుగుతున్న ప్రాంతాన్ని శుభ్రం చేశారు. సరాఫ్ బజార్ నుంచి ప్రారంభమైన రథయాత్ర సెంటర్ చౌరస్తా, ప్రధాన రహదారి మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. హరే రామ.. హ రే కృష్ణ. కృష్ణ కృష్ణ హరే హరే.. అంటూ స్వామి నామస్మరణ చేస్తూ భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు నామాజీ, రఘు రామయ్యగౌడ్, మిర్చి వెంకటయ్య, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు, మహిళలు, యువకులు, హిందూ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు

» జములమ్మ ఆలయం తరపున సమర్పణ

గద్వాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ దేవతకు జోగుళాంబ గద్వాల జమ్మిచేడు జములమ్మ ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జములమ్మ ఆలయం తరపున పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఈ ఏడాది కూడా ఆలయ చైర్మన్ వెంకటరాములు, డైరెక్టర్లు మంగళ వీరేశ్, ముసిలన్నల ఆధ్వర్యంలో సోమవారం ఆలయంలో అర్చకుడికి పట్టు వస్త్రాలను అందించారు. అంతకుముందు వారికి ఆలయ చైర్మన్ సాదర స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, సత్కరించారు.



బల్కంపేట ఆలయంలో అర్చకుడికి పట్టువస్త్రాలు అందజేస్తున్న జములమ్మ ఆలయ చైర్మన్

షూటింగ్ పోటీల్లో ఆరేపల్లి విద్యార్థిని ప్రతిభ

» అభినందించిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : షూటింగ్ చాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని మౌనిక ప్రతిభ కనబరిచింది. మౌనిక హైదరాబాద్ నగరంలోని కీసర మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్ సెకండీయర్ చదువుతోంది. గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 26న జరిగిన పోటీల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో క్రీడా శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరిని కలిసిన మౌనికను ఆయన అభినందించారు. ప్రభుత్వ సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డిని పరిచయం చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు సహకారం అందిస్తామని తెలిపారు. శిక్షణకు వెళ్లేందుకు రవాణా సౌకర్యంతో పాటు, రైఫిల్ కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుడు రామచంద్రయ్య, మత్స్యసహకార సంఘం గ్రామ అధ్యక్షుడు వెంకటన్న, స్థానికులు మోహన్, బాలయ్య, రాజు సురేశ్ పాల్గొన్నారు.



కాంస్య పతకం సాధించిన చిన్నారిని అభినందిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

పాలమూరులో చిరుత కలకలం



వీరన్నపేట సమీపంలోని కొండపై ఉన్న చిరుత (వృత్తంలో)

» వీరన్నపేట సమీపంలోని కొండపై కనిపించిన పులి

మహబూబ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని వీరన్నపేట పరిసరాలలో చిరుత కనిపించడం కలకలం సృష్టించింది. జనావాసానికి అతి సమీపంలో ఉన్న కొండపై సోమవారం ఉదయం 7:30 గంటల సమయంలో చిరుత పులి కనిపించింది. గమనించిన స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. కొందరు యువకులు సెల్‌ఫోన్‌లలో చిరుత ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో అవి వైరల్‌గా మారాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకొనేలోగా చిరుత అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఆ తర్వాత పరిసర ప్రాంతాల్లో వెతికినా చిరుత కనిపించలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికులు భయాందోళనలకు గురి కావొద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తామని, సీసీ కెమెరాలు బిగిస్తామని చెప్పారు.

సీఎం సహాయ నిధికి రైతు భరోసా

» కలెక్టర్‌కు అందించిన రైతు లక్ష్మీకాంతరెడ్డి



కలెక్టర్‌కు రైతుభరోసా నగదును విరాళంగా ఇస్తున్న లక్ష్మీకాంతరెడ్డి

వడ్డేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిన రైతు భరోసా నగదును ఓ రైతు ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా అందించారు. జోగుళాంబ గద్వాల జిల్లా, కోయిలదిన్నెకు చెందిన గోరంట్ల లక్ష్మీకాంతరెడ్డికి రైతు భరోసా కింద రూ. 95,400 ఆయన ఖాతాలో జమ అయ్యాయి. ఈ డబ్బును ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కులను సోమవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ సంతోష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ ఫలాలను తిరిగి అందించాలన్న ఆయన దృక్పథం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు.

ఎస్ఎన్ఎస్ పరిశ్రమపై విచారణ



రైతు రామిరెడ్డితో విచారణ చేస్తున్న ఆర్ఐ శంషీర్

ఎర్రవల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరు శివారులోని ఎస్ఎన్ఎస్ పరిశ్రమపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. పరిశ్రమ సమీపంలో రామిరెడ్డికి చెందిన పొలం ఉంది. దానిని పరిశ్రమ యాజమాన్యం 13 ఏళ్ల లీజుకు తీసుకున్నది. దీంతో ఆ భూమి పంటల సాగుకు పనికి రాకుండా పోయిందని బాధిత రైతు ఇటీవల కలెక్టర్ సంతోష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశం మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శంషీర్ వ్యవసాయ భూమిని పరిశీలించారు. రైతు రామిరెడ్డితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో విచారించి, ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని ఆయన తెలిపారు.

జాతీయ రహదారిపై డీసీఎం బోల్తా

» వాహనాల రాకపోకలకు అంతరాయం

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై డీసీఎం బోల్తాపడింది. జడ్చర్ల నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం సోమవారం తెల్లవారుజామున ఫ్లైవోవర్ సమీపంలో బోల్తా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని డీసీఎంను పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



న్యూస్ బాక్స్

ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

నవాబ్‌పేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బాధితులు వివిధ సమస్యలపై ఇచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించి, బాధితులకు సహకరించాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. సోమవారం ఫిర్యాదుల దినోత్సవంలో భాగంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

దైవచింతన అలవరుచుకోవాలి

నవాబ్‌పేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : దైవచింతన అలవరుచుకోవాలని ఎంపీడీవో జయరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ విగ్రహానికి టైల్స్, అద్దాలు ఏర్పాటు చేయించారు.

నోటు పుస్తకాల పంపిణీ

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం కొండేడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కొంగళి శ్రీకాంత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

పరిహారం అందించాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : దివిటిపల్లి డబుల్ బెడ్ రూం వద్ద 45 రోజుల క్రితం క్వారీ గుంతలో పడి ముగ్గురు యువకులు మృతి చెందిన కుటుంబాలకు పరిహారం అందించి, ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో మృతుల కుటుంబ సభ్యులు మునిరామ్ బేగం, లక్ష్మీ, దివ్య, అక్రంతో కలిసి వినతి పత్రం అందజేశారు.

స్థలాన్ని కాపాడాలి

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం కొత్తతండా అభివృద్ధికి కేటాయించిన స్థలాన్ని కాపాడాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో తండావాసులు వినతిపత్రం అందచేశారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని తండావాసులు రమేశ్‌నాయక్, చందర్‌నాయక్, ఉమ్లానాయక్, శంకర్‌నాయక్, వెంకటయ్య, శంకర్ కోరారు.

తప్పుడు నివేదిక ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవాబ్‌పేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నవాబ్‌పేట గ్రామ శివారులోని సర్వే నెంబరు 644పై తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు మల్లేష్‌యాదవ్ తెలిపారు. ఈ నెంబరుపై రెవెన్యూ అధికారులకు 2019లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు చేసిన కంటే ముందే విచారణ చేసినట్లు నివేదిక ఇవ్వడం, అధికారుల పనితీరు తెలుస్తుందన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

లయన్స్ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

పాలమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ నూతన కమిటీ సోమవారం జిల్లా కేంద్రంలో ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా శ్రీరామ్‌కుమార్, సెక్రెటరీగా డాక్టర్ సీ.బాబుల్‌రెడ్డి, కోశాధికారిగా విజయకుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ముఖ్య అతిథిగా చిన్న కిషన్‌రెడ్డి, రాజు, శశికాంత్, దామోదర్‌రెడ్డి, ప్రసాద్, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ సేవలు ప్రారంభం

మిడ్జిల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం విద్యార్థులకు ఫిజియోథెరఫీ సేవలు ప్రారంభించినట్లు ఎంఈవో వెంకటయ్య తెలిపారు. శారీరక దివ్యాంగులు, సెరిబ్రల్ పాలసీ విద్యార్థుల కోసం ఫిజియోథెరపీ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతీ సోమ, గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మార్సీ భవనంలో ఫిజియోథెరపిస్టు మహమ్మద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ చేయడం జరుగుతందని, అవసరమున్న విద్యార్థులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం జానకమ్మ, స్పెషల్ ఇండికెటర్స్ సౌందర్య, రవీందర్, సీర్పీ గోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల ప్రదానం

మిడ్జిల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం సుజాత సొంత డబ్బులతో విద్యార్థులకు టై, బెల్టులను సోమవారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని, గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఉచిత పుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివప్రసాద్, గ్రామస్థులు డోలు శ్రీనివాసులు, పాండు, కృష్ణయ్య, రాములు, శంకర్, భిక్షమయ్య ఉన్నారు.

తల్లిదండ్రుల స్ఫూర్తితో సామాజిక సేవలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా తెలిపారు. మొహబూబ్ అలీఖాన్ వర్ధంతిని సోమవారం రాజేంద్రనగర్‌లో ఆ సంఘ కార్యాలయంలో చిన్నారులతో కలిసి నిర్వహించారు. అలనాటి పుస్తకాలను ప్రదర్శించారు. చిన్నారులకు చిత్రలేఖనం నిర్వహించారు. తన తండ్రి మొహమూబ్‌అలీ రెండో ప్రపంచ యుద్ధంలో సైనికుడిగా పాల్గొన్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఆపరేషన్ ముస్కాన్

» బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ఎన్‌బి రత్నం

మహబూబ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బడిబయట మగ్గిపోతున్న బాలబాలికలను చేరదీసి వారిని బడిలో చేర్పించేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జూలై 1నుంచి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించనున్నారు. పోలీస్‌శాఖతో పాటు చైల్డ్ వెల్ఫేర్, కార్మిక శాఖలు కలిసి ప్రత్యేక బృందాలుగా నియమించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ బృందాలు తనిఖీలు నిర్వహించి ఎక్కడైనా బడిబయటి పిల్లలు బాలకార్మికులుగా పనిచేస్తే వారిని చేరదీసి కౌన్సిలింగ్ నిర్వహించి బడికి పంపించే కార్యక్రమాలు చేస్తారు. అదే సమయంలో పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరిట నిర్వహిస్తున్న ఈ తనిఖీలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేద న్న విమర్శలున్నాయి.

అడిషనల్ ఎస్పీ సమావేశం

ఆపరేషన్ ముస్కాన్ బృందాలతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషినల్ ఎస్పీ ఎన్‌బీ రత్నం సమావేశం నిర్వహించి ఆపరేషన్ ముస్కాన్ గురించి వివరించారు. జిల్లా అంతటా తిరగాలని, బాలలు ఎక్కువగా పనిచేసే పరిశ్రమలు, వ్యాపార సముదాయాలపై ఫోకస్ పెట్టి బాలలను చేరదీయాలని, యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే కౌన్సెలింగ్, కేర్‌హోమ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలకార్మికులను గుర్తిస్తే డయల్ 100, 1098 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మన్ ఎండీ నయీముద్దీన్, జువెనైల్ జస్టిస్ బోర్డ్ ఏస్టర్‌గ్రేస్, డీఈఎంవో మంజుల, డీసీపీవో నర్మద, ఎస్‌ఐ కు ర్మయ్య, మహిళా పీఎస్ ఎస్‌ఐ సుజాత పాల్గొన్నారు.

పైరవీలతో ఉదాసీనత..

నిత్యం బాలకార్మికులు ఎంతో మంది వివిధ వ్యాపార రంగాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. అధికార యంత్రాంగం ఆరు నెలలకోసారి నామమాత్రంగా తనిఖీలతో సరిపెడుతుందన్న విమర్శలున్నాయి. ఎక్కడైనా కార్మికులు గుర్తించి పట్టుకున్నా పైరవీలతో వదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి. అందుకే నెలరోజుల పాటు నిర్వహించే తనిఖీల్లో 50 మంది బాలలను కూడా చేరదీయని పరిస్థితి నెలకొంది. ఆరు నెలలకోసారి తనిఖీలు ఉంటాయని తెలిసిన యజమానులు ఈ నెలరోజుల పాటు అప్రమత్తంగా ఉంటున్నారు. ఆ తరువాత యథేచ్ఛగా బాలలను పనిలో పెట్టుకున్నా వారిపై చర్యలు తీసుకునే పరిస్థితి లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు.

యజమానులపై కఠిన చర్యలు..

బడిలో చదువుకోవల్సిన బాలలను కార్మికులుగా మారుస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని చట్టం చెబుతోంది. అవసరమైతే పీడీ చట్టం కింద కేసు నమోదు చేయవచ్చు. కానీ కొద్దిం ోజులుగా అలాంటి కఠిన చర్యలేవీ ఈ బృందాలు తీసుకున్న దాఖలాలు లేవు. పెద్దగా జరిమానాలు కూడా విధించడం లేదు. బాలలు పట్టుబడితే తల్లిదండ్రులకు అప్పగించడం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది


జీహెచ్‌ఎం గోపాల్‌రాజు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అన్ని వృత్తుల కన్న ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జానంపేట జిల్లా పరిషత్ పాఠశాల జీహెచ్‌ఎం గోపాల్ రాజు పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ వృత్తిపట్ల నీతి, నిజాయితీ అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పాఠశాలలో ప్రహరీ, అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకొంటానన్నారు. అంతకుముందు మండలంలోని పోల్కంపల్లి శివాలయ పునర్నిర్మాణం కోసం దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన రూ.50 లక్షలకు సంబంధించిన ప్రోసిడింగ్స్‌ను ఎమ్మెల్యే హైదరాబాద్‌లో గ్రామస్థులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు కృష్ణయ్య, నాగార్జున్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదయ్య, పూజారి నరసింహ శర్మ, నాయకులు రామన్‌యాదవ్, రవికాంత్‌రెడ్డి, శ్రీకాంత్, మహేష్, బైకని శ్రీనివాస్, సాయి, నరసింహులు పాల్గొన్నారు.

- అడ్డాకుల విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో పనిచేసి పదవీ విరమణ పొందిన లైన్ ఇన్స్‌సెక్టార్ మహ్మద్ సమీద్‌ను సోమవారం విద్యుత్తు ఉద్యోగులు సన్మానించారు. ఏఈ రాములు, ఎల్‌ఎంలు ఉమర్‌పాష, జానీ, ఎల్‌ఐ అబ్దుల్లా, శ్రీనివాసులు ఉన్నారు.

పదవీ విరమణ సహజం

హన్వాడ : పదవీ విరమణ సహజమని తహసీల్దార్ కిష్ట్యానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్లుగా పని చేస్తూ సోమవారం పదవీ విరమణ పొందిన వెంకటయ్య, మణెమ్మను తహసీల్దార్ సన్మానించారు. నాలుగేళ్లగా కార్యాలయంలో పని చేస్తూ అందరి మన్ననలు పొందారన్నారు. డీటీ వెంకటేశ్వరరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

ఎంపీడీవో, సూపరింటెండెంట్‌ల సేవలు బేష్

గండీడ్ : మండల అభివృద్ధిలో ఎంపీడీవో దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి సేవలు బేష్ అని జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో, సూపరింటెండెంట్‌ల పదవీ విరమణ కార్యక్రమానికి పాల్గొని, మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి సంజీవ్‌కుమార్, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిశ్చంద్రారెడ్డి, మహమ్మదాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, పీసీసీ సభ్యుడు నరసింహరావు, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బోరు కృష్ణయ్య పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



పాఠశాల ఎదుట ఏఐఎస్‌ఎఫ్ నాయకుల ధర్నా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాఠశాల ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్నా రని డీఈవో, ఎంఈవోలకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. కార్య క్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు సురేష్, శేఖర్, రాజేష్, అరుణ్, నరేష్, లింగం, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ అలవర్చుకోవాలి

దేవరకద్ర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలని బీజీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగామన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుకోవడానికి ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల కంటే ప్రభుత్వ విద్యా సంస్థలోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. చెడు వ్యవసనాలకు, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. రాష్ట ఉపాధ్యక్షుడు వెంకటేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వైజయంతి, బీసీ నాయకుడు రాము, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ పాఠశాల యాజయాన్యాలు అనుమతి తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు ప్రైవేట్ పాఠశాల అసోసియోషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ వినతిపత్రం అందజేశారు. అనుమతి లేకుండానే డీఈవో, ఎంఈవో అధికారి ఫొటోలు వేసి ప్రచారం చేసే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఈవో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

● జడ్చర్ల : ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ యువమోర్చా నాయకులు జడ్చర్ల ఎంఈవో మంజులాదేవికి సోమవారం వినతిపత్రం అందచేశారు. పుట్టగొడుగుల్లా ప్రైవేట్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని, అనుమతి లేని పాఠశాలలను మూయించాలంటూ ఎంఈవోను కోరారు. బీజేవైఎం నాయకులు శ్రీనాథ్, నరేశ్, యశ్వంత్, సూరజ్, సాయిచరణ్‌రెడ్డి హెచ్చరించారు.

మాట తప్పిన కాంగ్రెస్ గద్దె దిగాలి


భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు, సీసీకుంటలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భూత్పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, వెంటనే ప్రభుత్వం గద్దె దిగిపోవాలని బీజేపీ దేవరకద్ర నియోజవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం భూత్పూర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్రగా వెళ్లారు. అక్కడ ధర్నా చేపట్టిన అనంతరం తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. గత ఎన్నికల ముందు రైతులకు ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం అందిస్తానని చెప్పి, ఇప్పుడు మాట తప్పిందని విమర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు నర్సిములు ముదిరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సత్యనారాయణగౌడ్, నాయకులు ఎండీ ఫారుక్, సత్యంనాయక్, శంకర్‌నాయక్, శివ, మాధవరెడ్డి పాల్గొన్నారు.

● దేవరకద్ర : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణంరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. రాష్ట కౌన్సిల్ సభ్యుడు యజ్ఞ భూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, మండల నాయకులు దేవన్న, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజాలరాజు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

● మూసాపేట : కాంగ్రెస్ రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మల్లేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో అడ్డాకుల తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల అధ్యక్షుడు రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, చెన్నాగౌడ్, హరికృష్ణ, శివ, శ్రీనివాసులు, సుందరయ్య, రవి, బుచ్చన్న, మల్లేష్, నాగరాజు పాల్గొన్నారు.

● చిన్నచింతకుంట : రైతుల ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకుడు కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు నరేందర్, జనార్దన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాములు, నరేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

» ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థినులు



ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తున్న విద్యార్థినులు, ఓటు హక్కు వినియోగించుకున్న విద్యార్థిని

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిట్టబోయిన్‌పల్లి శివారులోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం మాదిరి ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల విద్యా క్యాలెండర్‌ను అనుసరించి పాఠశాలలో ప్రజాస్వామ్యం, భారతీయ ఎన్నికల విధానంపై విద్యార్థినుల్లో అవగాహన కల్పించేందుకు మాదిరి ఎన్నికలను నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. ఎన్నికల్లో ఓటు వేసే విధానం, ఓటు హక్కు ప్రాధాన్యంపై విద్యార్థినులకు వివరించి, మాదిరి ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ విద్యావతి, శ్రీరంగ రాజేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులను గౌరవించాలి : ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడిని గౌరవించాలని ఎస్పీ జానకి అన్నారు. ఫిర్యాదుదారులు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం ప్రజా ఫిర్యాదులను పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి 15 ఫిర్యాదులను ఎస్పీ అందుకున్నారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ అధికారులతో మాట్లాడారు. బాధితుల పట్ల ఉదారత చూపాలని, ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. బాధితులకు న్యాయం అందించడమే గ్రీవెన్స్ డే లక్ష్యం అన్నారు. అంతకుముందు మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. వాహనాల జరిమానా, వసూళ్లు, సిబ్బంది హాజరు తదితర విషయాలు తెలుసుకున్నారు.

పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం


మార్కెట్‌లో పనిచేసే వారికి యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం

పాలమూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఇది ప్రజా ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో దడవాయిలు, హమాలీలు, చాట కూలీలకు యూనిఫామ్స్, చీరలు ప్రభుత్వం తరపున పంపిణీ చేసి, మాట్లాడారు. సంక్షేమ పథకాలను మహిళల పేర్లతోనే ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. మీ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇల్లులేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్‌చైర్మన్ పెద్ద విజయ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, నాయకులు వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, ఎస్సీసెల్ చైర్మన్ సాయిబాబా, డీఎంవో బాలమణి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి భాస్కర్, సిబ్బంది వెంకట్రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఫయాజ్, అవేజ్, అజ్మత్‌అలీ, నాగరాజు, కమిటీ డైరెక్టర్లు, గుమస్తాలు, హమాలీలు, చాట కూలీలు పాల్గొన్నారు.

ఐకేపీ ద్వారా 68 వేల యూనిఫామ్‌లు

కోయిలకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలలో విద్యార్థులకు 68 వేల యూనిఫామ్‌లు అందించడం జరుగుతుందని డీపీఎం చెన్నయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో యూనిఫామ్‌ల తయారీ పనితీరును పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలోని 866 ప్రభుత్వ పాఠశాలల్లో 75 కేంద్రాల ద్వారా విద్యార్థులకు యూనిఫామ్‌లు తయారు చేయడం జరుగుతుందని, ఇప్పటికే విద్యార్థులకు 34 వేల యూనిఫామ్‌లు అందించామని, రెండో విడతలో మరో 34వేల యూనిఫామ్‌లు అందించడం జరుగుతుందన్నారు. యూనిఫామ్‌ల ద్వారా మహిళలకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో మహిళ సంఘం మండల అధ్యక్షురాలు తిరుపతమ్మ, ఏపీఎం మల్లేష్, సీసీలు బద్రునాయక్, కేశవులు, నరేశ్, సంతోష్ పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి


ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లుగా అవార్డులు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని టూ టౌన్ రెండో సీఐ ఎజాజుద్దీన్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మహబూబ్‌నగర్ డిపోనందు సోమవారం డిపో మేనేజర్ సుజాత అధ్యక్షత ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు మెకానిక్‌లకు నిర్వహించిన త్రైమాసిక అవార్డుల ప్రదానం కార్యక్రమానికి సీఐ పాల్గొని, మాట్లా డారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డులు ఇవ్వడం మంచి సంప్రదాయమని, ఈ విధానంతో ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని పేర్కొన్నారు. అవార్డులు పొందిన వారు, పొందని వారు కూడా అవార్డు కోసం పోటీ పడాలన్నారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ లక్ష్మీధర్మ మాట్లాడుతూ గత నెలలో అద్భుత ప్రతిభ కనబర్చిన సిబ్బందిని గుర్తించి, అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

గిరిజనులకు ప్రత్యేక కాలం కేటాయించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్

జడ్చర్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా 2027లో దేశవ్యాప్తంగా చేపడుతామని జనగణనలో షెడ్యూల్డ్ ట్రైబ్‌కు ప్రత్యేక కాలం కేటాయించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూడ్ ధర్మనాయక్ డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణంలోని గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. హిందూ, ముస్లిం, జైన్, క్రైస్తవులు మాదిరిగా గిరిజనులకు ప్రత్యేక కాలాన్ని కేటాయించాలని, గిరిజనుల మనోభావాలను గుర్తించాలని కోరారు. ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకత్వం ఇప్పటికే దేశ హోం మంత్రికి వినతిపత్రం అందజేశారని, నేటికీ కేంద్రం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగణనలో ప్రత్యేక కాలం కేటాయించకపోతే గిరిజనులంతా ఐక్యమై పోరాటం చేస్తా మని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, గిరిజన సంఘం నాయకులు సభావట్ చందునాయక్, సభావట్ సూర్యనాయక్ పాల్గొన్నారు.